


# మనసులోని మాట

చొక్కాపు వెంకటరమణ

ఒక ఊళ్లో రాజారాం అనే గొప్ప వ్యాపారి ఉన్నాడు. ఆయన ఎన్నో ఏళ్లనుంచి వ్యాపారం సాగిస్తున్నాడు. అతని తాత తండ్రులుకూడా ఆ నగరంలో పుట్టినవాళ్లే!

ఆ నగరంలోని పెద్దపెద్ద వాళ్లందరూ అతని కొట్టుకే వచ్చేవాళ్లు. అతని దగ్గర కొన్న వస్తువంటే ఎవరూ విమర్శించేవారు కాదు. 'చాలా బావుంది!' అని ఊరుకునేవారు.

మరికొందరయితే వస్తువును చూసి, అతని గురించి, అతని తాతలను గురించి చెప్పుకునేవారు.

రాజారాందగ్గర ధర్మయ్య అనే గుమాస్తా ఉండేవాడు. ధర్మయ్య పేరుకు తగ్గట్టు ధర్మబుద్ధి గలవాడు. చాలా పేదవాడు. పెద్ద సంసారం గలవాడు. ఆయనంటే రాజారాంకి ఎంతో నమ్మకం!

పెద్ద పెద్ద ఖాతాదార్ల ఇళ్లకు పెద్ద మొత్తాలకు వసూలుచేసుకురావడానికి అతన్నే పంపేవాడు రాజారాం. ధర్మయ్య ఎంత అంటే అంత! రాజారాం ఏనాడూ ధర్మయ్యని లెక్కలు అడిగేవాడుకాదు. ధర్మయ్య పుస్తకాల్లో లెక్కలు వ్రాయుటమేకాని అవి ఏనాడూ రాజారాం చూసి ఎరగడు.

ధర్మయ్యకూడా రాజారాంకు తెలియకుండాగానీ, లెక్కలు తప్పులు రాసిగానీ పైసాఅయినా తీసి ఎరుగడు! ఎంత ప్రాణం మీదికి వచ్చినా ముందు ఇంత తీసుకుంటానని రాజారాంని అడిగేవాడు. అందుకు రాజారాంకూడా కాదనేవాడుకాదు. తన కష్టార్జితం తనకుంటే చాలనుకునేవాడు ధర్మయ్య.

ఒకనాడు ధర్మయ్య భార్య ఇలా అంది:

"ఏమండీ! ఇన్నేళ్లుగా షావుకారుగారిదగ్గర పని చేస్తున్నారు గదా! ఒక్క దమ్మిడీ అయినా మిగిల్చారా? అమ్మాయిలకి చూస్తే పెళ్లీడు వస్తూంది కదా! అబ్బాయి చూస్తే పెద్ద చదువు చదువుతానంటున్నాడు. పోనీ, వాణ్ణి చదువు మానిపించి ఏదో పనిలో పడేస్తాం! కానీ, అమ్మాయిల పెళ్లిళ్ళు ఆపలేము కదా! ఈ రోజుల్లో ఎంత పేదవాడయినా పెళ్లి అంటేనే 'కట్నం కావాలి' అంటున్నాడు."

ఆమె ఇంకా ఏమో అనబోతూఉండగానే, "ఇంతకీ నీవనే దేమిటి?" అని అడిగాడు, కొంచెం చికాకుగా ధర్మయ్య.

"ఇదిగో! మీరు ఇలా చిరాకుపడతారనే ఇన్నేళ్ళుగా ఈ విషయమేకాదు, ఏ విషయమూ మీతో చెప్పటం మానుకున్నాను. మీరిలా చిరాకు తెచ్చుకుంటే ఎలా?" అంది ధర్మయ్య భార్య.

"అదికాదు! నీ వనే మాటేమిటో సరిగా చెప్పు!" అన్నాడు కొంచెం నెమ్మదిగా ధర్మయ్య.

"అదికాదండీ. పిల్లలిద్దరూ పెద్దవారవుతున్నారు కదా! వాళ్ల పెళ్లి పేరంటానికి ఏదైనా వెనకేసుకుంటే పనికొస్తుందంటున్నా!" అన్నాది ఆవిడ.

"ఇప్పట్నించీ . . ఆ ప్రయత్నం ఎందుకూ? ఆ వేళ వచ్చేసరికి అన్నీ అవే సునాయాసంగా జరిగిపోతాయి. ఎలాగూ ప్రతి నెలా షావుకారుగారు అయిదు రూపాయలు తీసి ఉంచుతున్నాడు కదా!" అన్నాడు ధర్మయ్య.

"ఎక్కడి అయిదు రూపాయలండీ, పిల్ల పెళ్లికి అయిదువేలు కావలసివస్తుంటేనూ! మన దగ్గరున్న నగలూ నట్రా అమ్మేస్తే ఎలాలేదన్నా ఇంకా అయిదు వందలన్నా కావాలి!" అంది ఆమె.

"అయితే నేనేం చేయమూ?" అన్నాడు ధర్మయ్య.

"మీరు మరీ అంత అమాయకులేమిటండీ! మన పక్కింటి వెంకట్రావు చూడండి! ఆ సేట్ దగ్గర పనికి కుదిరి పదినెలలు అయిందో లేదో! అప్పుడే పదివేలు సంపాదించాడు. అయితే అదంతా ఎలా సంపాదించాడంటారూ? అంతా తెలివితోనే ఉంది" అంది ఆమె.

"పదివేలు కాకపోతే ఇరవైవేలు సంపాదించనీ నీ 'మనసులో మాట' అర్థం అయింది. అదిమాత్రం నేను చచ్చినా చేయను!" అని నిర్మోహమాటంగా, సూటిగా చెప్పేశాడు ధర్మయ్య.

తిరిగి తానే అన్నాడు, "అయినా ఒకరి డబ్బు మనకెందుకూ? మన డబ్బు మనకి ఉంటె చాలదూ?" అని.

ఇంటిదగ్గర అలాగ అన్నాడేగానీ, భార్య చెప్పిన మాటలు చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి. అవి నిజంగానే తోచాయికూడా!

దుకాణంలో కూర్చున్నంతసేపూ ఏదో భారం అతని వీపుమీద ఉన్నట్టుగానే ఉంది. గతాన్ని గుర్తుకు తెచ్చుకుని విచారించాడు. 'న్యాయానికీ, ధర్మానికీ కూడా లేదు' అనుకున్నాడు.

ఏవేవో ఆలోచించాడు. తర్జనభర్జన పడి చివరికి ఒక నిర్ణయానికి వచ్చాడు ధర్మయ్య.

ఆ వారంలో ఎలా అయినాసరే అయిదువందల రూపాయలకి తప్పుడు లెక్క రాయాలనుకున్నాడు.

అదే రోజున . . .

షావుకారు రాజారాం అలా మడతకుర్చీలో పడుకుని ఏవేవో ఆలోచిస్తున్నాడు.

'ధర్మయ్య తనదగ్గర గుమాస్తాపనిచేస్తూ పాతికేళ్ళు పైనే అయింది. ఈ పాతికేళ్లలో ఏం రాశాడో? . . . ఏం చేస్తున్నాడో? ఒక్కనాడుకూడా పుస్తకాలు తీసి లెక్కలు చూడలేదు!

ధర్మయ్య మంచివాడే కావచ్చు. కానీ, డబ్బు పాపిష్టిది! దాన్ని చూస్తే మంచివాళ్లకిసైతం చెడ్డ బుద్ధులు పుడుతూంటాయి! అదీగాక లెక్కలు చూడటం తన కర్తవ్యం. కాబట్టి చూడాలి!' అని నిశ్చయించుకున్నాడు రాజారాం.


వెంటనే నౌకరును పిలిచి "బండి సిద్ధంచేయించు" అని చెప్పాడు.

అదే సమయంలో . . .

ఇక్కడ దుకాణంలో ధర్మయ్య గుండెనిబ్బరం చేసుకుని అయిదువందల రూపాయలూ ఇనపపెట్టెలోనించి తీశాడు! చేతులు వణికాయి! భయంవేసింది! శరీరమంతా చెమటలు పోశాయి!

షావుకారుకు నేనంటే ఎంతో నమ్మకం. పాతికేళ్ల నుంచీ ఈ కొట్టులో పనిచేస్తున్నాను. షావుకారు ఉప్పు తిని, షావుకారుకే ద్రోహం చేయడమా? ఇంత

(తరువాయి 34 వ పేజీలో)




( 31 వ పేజీ తరువాయి)

కంటే నీచం . . . దుర్మార్గం ఇంకొకటి లేదు! షావుకారు ఒకవేళ వచ్చి లెక్కలు అడిగితే తప్పక దొరికి పోతాను. పాతికేళ్లనుంచీకూడా ఇలాగే చేస్తున్నానన్న అనుమానం షావుకారుకు తప్పక కలుగుతుం దన్నాడు. వెంటనే ఉద్యోగంలోంచి తొలగించవచ్చు. ఇలాంటి పని చేసిన నాకు ఇంకెక్కడా ఉద్యోగం దొరకదు. అయినా ఇంత వయస్సు వచ్చిన తరువాత కోరి పాపాన్ని తెచ్చుకోవడమేకానీ, ఇది మంచి పని కాదు. ఇలాంటి పని ఈ జన్మలో చేయను. లక్ష్మీదేవితోడు' అని ఆ అయిదువందల రూపాయల నోట్ల కట్టలూ చేతిలో పట్టుకొని ఒట్టుపెట్టుకొన్నాడు. ఆ డబ్బుని తిరిగి పెట్టెలో పెట్టేశాడు.

అదే సమయంలో . . .

షావుకారు రాజారాం సగందూరం వచ్చిన తరువాత యిలా అనుకున్నాడు:

'నేను ధర్మయ్యని పాతికేళ్లనుంచి లెక్కలు అడుగ లేదు. ఈవేళ హఠాత్తుగా వెళ్లి లెక్కలు అడిగితే ధర్మయ్య బాధపడతాడు. ఈ అవమానంతో ఉద్యోగం కూడా మానివేయవచ్చు. తిరిగి నాకు ఇంత నమ్మకమైనవాడు దొరకడు. లెక్కలు అడిగి ధర్మయ్యని బాధ పెట్టడం అంత మంచిపనికాదు. ఇన్నాళ్లనుంచీ ఇంత నమ్మకంగా పనిచేస్తున్నవాడికి ఏదో ఒక కానుక ఇవ్వడం పోయి, లెక్కలు అడగడం అన్యాయం.'

ఇలా అనుకుని షావుకారు మనస్సు మార్చుకున్నాడు.

'బండి వెనక్కు తిప్పు'' అన్నాడు.

బండివాడు బండిని వెనక్కు తిప్పేశాడు.

బండి ఇంటికి వెళ్లిపోయింది.

ధర్మయ్య ఇనప్పెట్టె మూసేశాడు.

మరునాడు షావుకారు మామూలుగా దుకాణానికి వచ్చాడు. ధర్మయ్య ఏమనుకున్నాడో ఏమో పద్దుల పుస్తకాలు తీసుకువచ్చి షావుకారుముందు పెట్టి, ''ఏమండీ! పాతికేళ్లనుంచి మీరు లెక్కలే చూడటం లేదు. అందుచేత మీరు ఓ సారి చూస్తారని తెచ్చాను'' అన్నాడు షావుకారుతో ధర్మయ్య వినయంగా.

షావుకారు క్షణకాలం ఆశ్చర్యంతో అలాగే చూస్తూ ఉండిపోయాడు.

నిన్న అనుకున్న తన 'మనసులోని మాట' అతని కెలా తెలిసిందా? అని.

''ధర్మయ్యా! నువ్వు ఏమీ అనుకోకుంటే ఓ విషయం చెప్పాలనుకుంటున్నాను'' అన్నాడు రాజారాం.

''చెప్పండి'' అన్నాడు ధర్మయ్య.

షావుకారు ముందురోజు తను బయలుదేరిన సంగతంతా విశదంగా చెప్పాడు.

''ధర్మయ్యా! నీవేమీ బాధపడకు. నాకీ బాధతోనే రాత్రంతా నిద్రలేదు. ఈ పాతికేళ్ల సేవకీ అయిదు వందల రూపాయలు కానుకగా మంజూరుచేశాను. ఇనప్పెట్టెలోంచి తీసుకో. నేని లెక్కలను చూడలేను. చూడను. ఆ పాపం . . . పుణ్యం నీదే'' అని చెప్పి గబగబా వెళ్లి బండి ఎక్కి వెళ్లిపోయాడు.

ధర్మయ్య నిశ్చేరపోయాడు.

తన 'మనసులోని మాట' షావుకారుకి ఎలా తెలిసిందో ధర్మయ్యకి బోధపడలేదు.

న్యాయానికీ, ధర్మానికీ కూడు లేదనడం తెలివి తక్కువతనం! ధర్మయ్య చెంపలు వేసుకున్నాడు. అంతే!

★